రోడ్లు, కాల్వలు మూసేశారు

- ఎక్కడికక్కడే నిలిచిపోతున్న మురుగు
- ఆరు నెలలుగా నరకం చూస్తున్న ప్రజలు
- మానం ఆంజనేయులు కాలనీవాసుల అవస్థలు
- ఫిర్యాదులెన్ని ఇచ్చినా కానరాని చర్యలు

కాలనీ : మానం ఆంజనేయులు కాలనీ

వార్డు : 7వ వార్డు (ఐటీ సెజ్ జంక్షన్ సమీపంలో)

మూసేసిన కాల్వలు, రోడ్లు **6**

నివాసాలు: సుమారు **325**

పేదల కోసం నిర్మించిన కాలనీ అది. కాలక్రమంలో అక్కడి భూముల విలువ అనూహ్యంగా పెరగడంతో కొందరి వ్యక్తుల కన్ను పడింది. దీంతో పేదలను నయానో, భయానో లొంగదీసుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కాలనీని ఆనుకుని ఉన్న భూమి తనదంటూ గోడలు కట్టేయడంతో కాలనీలో ఆరు చోట్ల రోడ్లు, కాల్వలు మూతపడిపోయాయి. ఎక్కడికక్కడ మురుగు పేరుకుపోయి కాలనీవాసులు ఆరు నెలలుగా నరకం చూస్తున్నారు. ఎన్ని వినతులిచ్చినా.. అధికారులొచ్చినా పరిశీలనలే తప్ప చర్యలేమీ లేకపోవడంతో దిక్కుతోచని దయనీయ స్థితిలో ఉన్నారు.



కాలనీ నుంచి బయటకు వెళ్లే రోడ్డు మూసివేసిన దృశ్యం

మధురవాడ: జీవీఎంసీ లక్షలాది రూపాయలు వెచ్చించి, నిర్మించిన కాల్వలు, రోడ్లు ఉన్న భూమి తనదని, అక్కడ మురుగునీరు వెళ్లడానికి, డ్రైనేజీలు ఉండడానికి వీల్లేదంటూ ఓ వ్యక్తి అడ్డంగా గోడలు కట్టేశాడు. దీంతో మురుగునీరు కాలనీలోనే నిల్వ ఉండిపోయి, అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇదీ జీవీఎంసీ జోన్–2 పరిధి ఏడో వార్డులోని మానం ఆంజనేయులు కాలనీలో పరిస్థితి.

ఐటీ సెజ్ జంక్షన్‌కు అత్యంత సమీపంలోని విలువైన భూముల్లో ఈ కాలనీ ఉంది. 1998లో అప్పటి ఎమ్మెల్యే మానం ఆంజనేయులు హయాంలో మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 125/2, 126/2లలో ఈబ్ల్యూఎస్ వుడా ఎల్‌పీ నంబర్ 87/97 లే అవుట్‌లో పేదలకు పట్టాలు ఇచ్చారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది పేదలు వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ప్రస్తుతం ఈ భూముల విలువ బాగా పెరిగింది. దీంతో కొందరు వ్యక్తులు కుయుక్తులు పన్నుతున్నారు. ఇందులో భాగంగానే ఆర్థిక, అంగ బలం ఉన్న వ్యక్తి మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 126/4లో కాలనీని ఆనుకుని ఉన్న భూమి తమదంటూ.. కాలనీ నుంచి బయటకు వెళ్లే రోడ్లతో పాటు డ్రైనేజీలకు అడ్డుగా 6 చోట్ల 6 నెలల క్రితం దౌర్జన్యంగా గోడలు కట్టేశాడు. దీంతో అప్పటి నుంచి కాలనీవాసులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

ఫిర్యాదులెన్ని ఇచ్చినా..

దీనిపై కాలనీ వాసులు కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు ఇచ్చినా స్పందన అంతంతమాత్రంగానే ఉంటోంది. సంబంధిత సిబ్బంది, జోనల్ కమిషనర్ వంటివారు వచ్చి చూసి వెళ్తున్నారు తప్ప, చర్యలు మాత్రం లేకపోయాయి.



మాస్టర్‌ప్లాన్ రోడ్డుకు అడ్డంగా కట్టేసిన గోడ



పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు ఇస్తున్న కాలనీవాసులు (ఫైల్)

వీఎంఆర్‌డీఏ చైర్మన్‌కు ఫిర్యాదు

లక్షలాది రూపాయల ప్రజాధనంతో కాలనీలో నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్లు, కాల్వల పూడ్చివేతపై చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు వీఎంఆర్‌డీఏ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం విశాఖలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో చైర్మన్ ప్రణవ్ గోపాల్‌ను కలసి ఫిర్యాదు ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు జేడీ నాయుడు, కాలనీ కార్యవర్గ సభ్యులు సీహెచ్‌వై నాయుడు, డి. శ్రీనివాసరావు తదితరుల ఫిర్యాదు ఇచ్చినవారిలో ఉన్నారు.

ఆరు నెలలుగా నరకం చూస్తున్నాం



మా ఇంటి వద్దే కాల్వలు మూసేశారు. ఆరు నెలలుగా ప్రత్యక్ష నరకం చూస్తున్నాం. అంతా వచ్చి చూసి వెళ్లిపోతున్నారు. చంటి పిల్లలతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దుర్వాసన దారుణంగా ఉంది. చంటి పిల్లలతో భయంగా ఉంది. –కట్టా లక్ష్మి, కాలనీవాసి

ప్రశాంతంగా జీవించలేకపోతున్నాం



కాలనీలో రోడ్లు మూసేయడంతో కొన్ని నివాసాలకు దారి కూడా లేకుండా పోయింది. ప్రభుత్వం వేసిన రోడ్లనే ప్రైవేటు వ్యక్తి దౌర్జన్యంగా మూసేస్తే అధికారులు పట్టించుకోవడం లేదు. కలెక్టర్‌కు, జీవీఎంసీ కమిషనర్‌కు, వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు, ఇతర అధికారులకు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు ఇచ్చాం. ప్రశాంతంగా జీవించే హక్కును కోల్పోయాం. ఇలాగే పరిస్థితి కొనసాగితే కోర్టును కూడా ఆశ్రయిస్తాం. – బొడ్డేపల్లి సురేష్, కాలనీ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు

కాలనీవాసుల ఇబ్బందులు తొలగించాలి



1994–98 మధ్యకాలంలో మానం ఆంజనేయులు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయన చొరవతో ఏర్పాటు చేసిన బడుగు, బలహీన వర్గాల కాలనీ ఇది. కాల్వలు, రోడ్లకు అడ్డంగా ఓ వ్యక్తి 6 చోట్ల అడ్డంగా గోడలు కట్టేశారు. మురుగుతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణమే స్పందించి రోడ్లు, కాల్వల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి. –మరుపిళ్ల పైడిరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి

పేరుకుపోతున్న మురుగు



కాల్వలు మూసేయడంతో కాలనీలో పేరుకుపోయిన మురుగునీరు

ఆర్‌టీసీ కాలనీ – ఐశ్వర్య లే అవుట్ – మానం ఆంజనేయులు కాలనీ మీదుగా కార్‌షెడ్–ఐటీ జంక్షన్ మాస్టర్ ప్లాన్ రోడ్డును కలిపే 40 అడుగుల రహదారికి అడ్డంగా గోడ కట్టి మూసివేశారు. దీంతో పాటు కాలనీలో 6 చోట్ల కాల్వలు, రోడ్లకు అడ్డంగా గోడ కట్టేయడం వలన ఎగువ నుంచి వచ్చే మురుగు నీరు కాలనీలోనే నిలిచిపోతోంది. మురుగు నిలిచిపోవడంతో ఈగలు, దోమలతో పాటు జలగలు వృద్ధి చెంది నివాసాల్లోకి ప్రవేశిస్తున్నాయి. పందులు, పశువుల స్థావరాలుగా మారాయి. ఇక దుర్గంధంతో పరిసర ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. అక్కడి ఇళ్లలో ఉండలేక, వదిలి బైటకి వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇక వర్షాకాలం వస్తే ఇబ్బందులు రెట్టింపు అవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

మట్టి తరలిస్తున్న లారీ, జేసీబీ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ, జేసీబీ

తగరపువలస: ఆనందపురం మండలం బోని పంచాయతీలో అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీ, జేసీబీలను పోలీసులు సోమవారం సాయంత్రం స్టేషన్‌కు తరలించారు. ఈ లారీలు, యంత్రాలు మట్టిని ఎక్కడికి తరలిస్తున్నాయి? అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాలపై విచారణ జరుపుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



గోస్తని నదిలో వేసిన రోడ్డును పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం సమీపాన గోస్తని నదిలో నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేసేందుకు మట్టి, రాళ్లతో వేసిన రోడ్డును సోమవారం సాయంత్రం పొక్లెయిన్‌తో తొలగించారు. గోస్తని నదిలో నుంచి ఈ రోడ్డు మీదుగా కృష్ణాపురం నుంచి మద్ది మీదుగా రాత్రివేళల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఆర్ఐ శ్యామల, వీఆర్వో రవి ఆధ్వర్యంలో నదిలో వేసిన రోడ్డును పొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం: భీమిలిలోని యువ భారత్, వివేకానంద రీడింగ్ రూమ్ ఆధ్వర్యంలో బాలికల గురుకుల పాఠశాల వద్ద విద్యార్థినులకు ‘ఆరోగ్యం– ఆవశ్యకత’ అంశంపై సోమవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. నిర్వాహకులు సంకురుబోతు జోగారావు, జరజాపు సురేష్ మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ తగిన మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోటీలో గెలిచిన విద్యార్థులకు వివేకానంద చరిత్ర పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయప్రకాశ్, సభ్యులు పాల్గొన్నారు.


భవన నిర్మాణ కార్మికుల నిరసన

మధురవాడ: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని కొమ్మాది జంక్షన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు నిరసన చేపట్టారు. సీఐటీయూ అనుబంధ విశాఖ జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం మధురవాడ జోన్ ప్రధాన కార్యదర్శి పెడాడ రాజకుమార్ మాట్లాడుతూ ఈ సమస్యలు పై ఈ నెల 24న ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా చేపడుతున్నామన్నారు.

అగ్నిప్రమాదంతో అప్రమత్తం

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం జాతీయరహదారిని ఆనుకుని పాత టైర్లు ఉంచిన దుకాణంలో సోమవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి ప్రమాద తీవ్రతను అదుపు చేశారు. పక్కనే పెట్రోల్ బంకు ఉండటంతో మంటలు అటుగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వెంటనే మంటలు అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో పాత టైర్ల దుకాణానికి రూ.20వేలు నష్టం సంభవించినట్లు అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరాజు తెలిపారు.

జోన్-2 పీజీఆర్‌ఎస్‌కు 24 అర్జీలు



మధురవాడ జోనల్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు 24 అర్జీలు వచ్చాయి. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్–4, ఈఈ పబ్లిక్ వర్క్స్– 6, వాటర్ సప్లై–2, పబ్లిక్ హెల్త్–1, రెవెన్యూ–06, ఎలక్ట్రికల్–03, యూసీడీ విభాగానికి 2 చొప్పున అర్జీలు వచ్చాయి. పలువురు అధికారులు పాల్గొన్నారు.

‘కోరాడ’ కుటుంబానికి బొత్స పరామర్శ



కోరాడ నాగభూషణం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బొత్స

తగరపువలస: ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోరాడ నాగభూషణం కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. ఆనందపురం మండలం వేములవలసలోని నాగభూషణం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బంటుపల్లి మణిశంకర నాయుడు, బంక కృష్ణంనాయుడు, పాండ్రంగి అప్పారావు, బంక శ్రీను, షిణగం దామోదరరావు, కోరాడ రాంబాబు, కోరాడ దశరథ్, ఇల్లపు వెంకటరావు, ఉప్పాడ సూర్రెడ్డి, రౌతు వెంకటరావు తదితరులున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు 26 నుంచి రిజిస్ట్రేషన్లు



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

కొమ్మాది: ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఈ నెల 26 నుంచి మే 15 వరకు విద్యార్థుల తరపున తల్లిదండ్రులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ సూచించారు. చినగదిలి మండలం వాడపాలెం ఎంఈవో కార్యాలయంలో ఆయన సోమవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఐదేళ్లు నిండిన విద్యార్థుల కోసం తమ పరిధిలో ఉన్న సచివాలయాలలోనే రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. ప్రతి ప్రైవేట్ యాజమాన్యం 25 శాతం సీట్లు ఇచ్చేందుకు సీఎస్ఈ వెబ్‌సైట్‌లో ఈ నెల 21 నుంచి 25 వరకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలన్నారు. లేనివారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంఈవోలు సీహెచ్.రవీంద్రబాబు, పి.అనురాధ, సీఆర్పీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఐటీ హబ్ భూ సేకరణ కోసం గ్రామసభ



ఆర్డీవో, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందిస్తున్న తర్లువాడ రైతులు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ గ్రామ సర్వే నంబర్ 1లో ఐటీ హబ్ కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించనున్న 200 ఎకరాల కోసం సోమవారం అత్యవసర గ్రామసభ నిర్వహించారు. భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో డీ పట్టా భూములకు ఎకరాకు రూ.42.50 లక్షలు, ఆక్రమణదారులకు రూ.17 లక్షలు పరిహారం ఇవ్వనున్నట్టు అధికారులు రైతులకు తెలిపారు. దీంతో రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ డీ పట్టా భూములకు రూ.70 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 2002లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ మొక్కలు నాటుకుని ఫలసాయం పొందడానికి 520 మంది రైతులకు భూమి ఇచ్చారన్నారు. ప్రస్తుతం వారికి 15 సెంట్ల భూమితో నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఎంఈవో అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో రమణ

పద్మనాభం: ఒడిశా రాష్ట్రం కెంజూరులో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున తలపడిన ఆర్‌వీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను ఎంఈవో పి.రమణ సోమవారం అభినందించారు. ఈ పాఠశాలకు చెందిన టి.చరణ్, టి.రాజ్ కుమార్, టి.నితిన్, ఎన్.తనుజ్ కుమార్ ఆంధ్రప్రదేశ్ టీమ్ తరఫున ఈ పోటీల్లో తలపడ్డారు. ఒకే పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఈ పోటీలకు ఎంపికై తలపడడంతో, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వీరికి ప్రోత్సాహకంగా కప్ అందజేసింది. ఈ సందర్భంగా పాఠశాలకు విచ్చేసిన ఎంఈవో ఈ కప్‌ను విద్యార్థులకు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.శంకరరావు, పీడీ రవి పాల్గొన్నారు.

వేతనాల కోసం ఉపాధి హామీ కూలీల ఆందోళన



రేఖవానిపాలెంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

తగరపువలస: ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వాలు బకాయి వేతనాలు చెల్లించాలని కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. భీమిలి మండలం మూలకుద్దు, రేఖవానిపాలెం పంచాయతీలలోని పని ప్రదేశాలలో సిటూ తరఫున కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టంలో పేర్కొన్న ప్రకారం కూలీలకు 15 రోజులలో వేతనాలు చెల్లించవలసి ఉన్నా ఎక్కడా జరగడం లేదన్నారు. రోజుకు రూ.700 వేతనం, కూలీల కుటుంబాలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భీమిలి డివిజన్ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా భీమిలి జోన్ కార్యదర్శి కె.నాగరాణి, నాయకులు గున్న, ఉమా తదితరులు పాల్గొన్నారు.

సీతారాం చంద్రుడూ ఇదేం పని?

తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీలో సీతారాం చంద్రుడు అనే వ్యక్తి ఏకకాలంలో గ్రామ సచివాలయం, ఉపాధి హామీ పనులు నిర్వహిస్తూ రెండు చోట్లా వేతనాలు తీసుకుంటున్నాడని పంచాయతీ వాసులు ఆరోపిస్తున్నారు. సచివాలయంలో పారిశుధ్య సిబ్బందికి సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ నెలకు రూ.8వేలు వేతనం పొందుతున్నాడన్నారు. అదే సమయంలో ఉపాధిహామీ పనులకు హాజరై, పనులు చేయకుండానే మస్తరు వేసుకుంటూ ఇంటికి వెళ్లిపోతున్నాడన్నారు. తద్వారా ఇక్కడ కూడ పనికి వేతనం పొందుతున్నాడన్నారు. ఈ విషయం తెలిసినా సచివాలయ, మండల పరిషత్ అధికారులు కూటమికి చెందిన నాయకుడని నోరు మెదపడం లేదన్నారు. పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్సీకి రిజర్వ్ చేసినా ఇప్పటి వరకు నియమించలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి హామీ పనులు జరుగుతున్నందున విచారణ జరపాలని కూటమి నాయకులే ఇక్కడ డిమాండ్ చేయడం కొసమెరుపు.

ముందుగా రైతుల భూములు సర్వే చేయాలి

తగరపువలస: ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో భాగంగా ముందుగా రైతులకు సంబంధించిన భూములను సర్వే చేయాలని భీమిలి మండలం తాటితూరు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దుంపల ప్రభాకర్ మాట్లాడుతూ ఇటీవల పంచాయతీలో గ్రామసభ నిర్వహించిన రెవెన్యూ అధికారులు రీ సర్వేకు సహకరించాలని రైతులను కోరారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ భూముల సర్వే పూర్తయిందని, తర్వాత రైతులకు సంబంధించిన భూములు సర్వే చేయవలసి ఉండగా, సర్వే సిబ్బంది ఎల్‌పీలు రాని ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థల సేవలలో కాలం గడుపుతున్నారని విమర్శించారు. చివరిగా రైతులకు సంబంధించిన భూములు రీ సర్వే జరపడం వలన మళ్లీ భూ సమస్యలు మొదటికి వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రీ సర్వే పట్ల చిత్తశుద్ధి, రైతుల పట్ల ప్రేమ ఉంటే రియల్ ఎస్టేట్ భూముల కంటే ముందుగా రైతుల భూములు సర్వే చేయించాలని డిమాండ్ చేశారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

సీతమ్మధార: మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కొమ్మాది డ్రైవర్స్ కాలనీకి చెందిన పల్లంటి దేవి, తల్లి లక్ష్మితో కలిసి సోమవారం ఉదయం రామాటాకీస్ దరి ప్రభుత్వ కంటి ఆస్పత్రికి వచ్చారు. కంటి వైద్య పరీక్షల నిమిత్తం లోపలకు వెళ్లిన దేవి కనిపించలేదు. ఆమెకు మతిస్థిమితం సరిగా ఉండకపోవడంతో తల్లి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. చేసేదేమీ లేక ద్వారకా పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి సబ్‌స్టేషన్ వద్ద నిరసన



సబ్‌స్టేషన వద్ద కాలనీవాసులు

తగరపువలస: రోజూ రాత్రి తెల్లవార్లు విద్యుత్ కోత విధిస్తుండటంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్సీ కాలనీవాసులు సబ్‌స్టేషన్ వద్ద సోమవారం అర్ధరాత్రి నిరసన తెలిపారు. భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ ఎస్సీ కాలనీలో మూడు రోజులుగా రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు అనధికార విద్యుత్ కోత విధిస్తున్నారు. భీమిలి కృష్ణాకాలనీలోని సబ్ స్టేషన్‌కు రోజూ వెళ్లి ఫిర్యాదు చేస్తున్నా సిబ్బంది స్పందించడం లేదు. సోమవారం రాత్రి కూడా ఇదే పరిస్థితి ఎదురవడంతో రాత్రి 11.30 గంటల సమయంలో గ్రామస్తులు ఆందోళన చేయడానికి గాను సబ్‌స్టేషన్‌కు తరలివెళ్లారు.

పౌష్టికాహారంతో శిశువుల ఆరోగ్యం పదిలం



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న మండల పరిషత్ ఏవో జయ ఉమ

పద్మనాభం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు క్రమం తప్పకుండా తీసుకోవాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మణికుమారి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు తిన్నప్పుడే బిడ్డలు ఆరోగ్యంగా పుడతారన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. చిన్నారులకు మండల పరిషత్ ఏవో జయ ఉమ అన్నప్రాశన చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో పి.రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, వెలుగు ఏపీఎం సాయి రమేష్, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు, పలు గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యపై కాలనీవాసుల ఆందోళన

జోన్-2 జెడ్సీ చాంబర్ ఎదుట బైఠాయింపు



మధురవాడలో జెడ్సీ చాంబర్ ఎదుట బైఠాయించిన కాలనీ వాసులు

మధురవాడ: జీవీఎంసీ ఆరో వార్డు కే2, కే1 కాలనీల రహదారి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జోన్–2 జోనల్ కమిషనర్ చాంబర్ ఎదుట బైఠాయించి, నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రోడ్డు సమస్యను పరిష్కరించకపోవడంతో నవోదయ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముందుగా రోడ్డుపై గోతులన్నా పూడ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లపై ప్రజల ప్రాణాలు పోతున్నా పాలకులకు చీమకుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమన్నారు. అనంతరం ఆందోళనకారుల వద్దకు వచ్చిన జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, కాలనీ నాయకులు అవతార్‌సింగ్, ఎండీ అతిఫ్, బాబా, కె.పద్మ, పి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మృతదేహం లభ్యం

తగరపువలస: తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 50–60 ఏళ్ల వయసు కలిగిన పురుషుని మృతదేహం నుజ్జునుజ్జయిన స్థితిలో సోమవారం ఉదయం లభ్యమైంది. మామిడిలోవ ఇంచార్జ్ వీఆర్వో కించా మల్లు దొర ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం రాత్రి పెందుర్తి–ఆనందపురం జాతీయ రహదారిపై కోకోకోలా ప్లాంట్ ఎదురుగా జరిగిన ప్రమాదంలో ఈ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. స్థానికుల సమాచారం ప్రకారం, శొంఠ్యాం, మామిడిలోవ ప్రాంతాల్లో మతిస్థిమితం లేని వ్యక్తి తిరిగేవాడని, అతనే ప్రమాదంలో మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. వేగంగా వచ్చిన వాహనం ఢీకొనడం వల్లే ఈ దుర్ఘటన జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుని ఒంటిపై నల్లటి డ్రాయర్, నీలం రంగు ట్రాక్ మాత్రమే ఉన్నాయి. మిగిలిన శరీరం ఛిద్రం కావడంతో గుర్తించడం కష్టంగా ఉంది. సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్నిమాంబ ఆలయంలో చోరీ

కొమ్మాది: జీవీఎంసీ 4వార్డు భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట గ్రామ దేవత ఎర్నిమాంబ ఆలయంలో ఆదివారం చోరీ జరిగింది. వెండి వస్తువులైన శఠగోపం, పంచపాత్ర, ఉద్ధరిణి చోరీకి గురైనట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మే నెలలో అమ్మవారి పండగ సందర్భంగా ఆలయంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరైనా ఆ వస్తువులను తీసి పక్కన పెట్టి ఉంటారని అనుకున్నారు. వెండి వస్తువులు దొరకకపోవడంతో సీసీ ఫుటేజీను పరిశీలించగా.. ఓ వ్యక్తి వెండి వస్తువులను తీసుకుంటున్నట్లు కనిపించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇదే ఆలయంలో రెండు నెలల క్రితం అమ్మవారి హుండీని దొంగలు ఎత్తుకుని పోయారు. ఆలయ కమిటీ నిర్వహణ లోపంతో వరుస చోరీలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.